తెలుగు కళాసమితి న్యూజెర్సీ ప్రజోత్పత్తి ఉగాది కథల పోటీలో రూ. 300/-లు గెలుపొందిన కథ

# ప్యారిస్ కుక్కపిల్ల



— పసుపులేటి మాధవరావు

సాయంత్రం ఆరు గంటలయింది. రామిరెడ్డి ఆఫీసులో ఏవో ఫైల్సు చూసుకుంటున్నాడు. అతని ఏకాగ్రతని భంగపరుస్తూ ఇంటర్‌కమ్ మ్రోగింది.

"యస్" అన్నాడు రామిరెడ్డి ఇంటర్‌కమ్ అందుకొని.

"ఈ రోజు 7-30కి మినిష్టర్ గారింట్లో పార్టీ వుంది సార్" గుర్తు చేశాడు **P.A.** రఘు.

"యస్...యస్ బయలుదేరుతున్నాను కారు రెడీ చెయ్యమని డ్రైవర్‌కి చెప్పు" అని ఫైల్సు సర్దటం మొదలెట్టాడు.

రామిరెడ్డి గొప్ప వ్యాపారవేత్త. కోట్ల మీద వ్యాపారం. అలానే ఆస్తులు కూడా. వ్యాపార రంగంలోనే కాక రాజకీయ రంగంలో కూడా మంచి పలుకుబడి కలిగిన మనిషి. ఆ ఊళ్ళో రామిరెడ్డి పేరు వినని వారంటూ వుండరంటే అతిశయోక్తి కాదు.

అతను ఆఫీసు నుండి బయటికొచ్చేటప్పటికి కారు రెడీగా వుంది. రామిరెడ్డితోపాటు రఘు కూడా కారెక్కాడు. వెంటనే వేగంగా దూసుకుపోయింది బ్లూ మారుతి. ఓ పది నిముషాల్లో రామిరెడ్డి ఇంటికి చేరింది.

"మిస్టర్ రఘూ, నేను స్నానం చేసి ఓ గంటలో మినిష్టరు గారింటికి వెళతాను. మన కొత్త ప్రపోజల్ పేపర్సు తీసుకొని నువ్వు కూడా అక్కడికి రా" అంటూ కారు దిగాడు రామిరెడ్డి.

"యస్ సార్" అని శలవు తీసుకున్నాడు రఘు.

రోజూ రామిరెడ్డి కారులోంచి కాలు కింద పెట్టగానే తోకాడించుకుంటూ గెంతుతూ హుషారుగా పరుగెత్తుకొచ్చే 'డాలీ' ఆ రోజు రాలేదు. 'డాలీ' ముద్దులొలికే తెల్లటి కుక్కపిల్ల. దానిని ప్యారిస్ నుంచి తెప్పించాడు సరదాకోసం.

"డాలీ ఎక్కడ?" పక్కనే చేతులు కట్టుకుని నిలబడి వున్న పనిమనిషిని అడిగాడు.

"మధ్యాహ్నంనించి నలతగా వుంటే సుందరయ్య ఆస్పత్రికి తీసుకెళ్ళాడండి" చెప్పాడు పనిమనిషి. సుందరయ్య కుక్కల అటెండెంటు. డాలీ కాక మరో నాలుగు సింహాల్లాంటి కుక్కలున్నాయి ఆ ఇంట్లో.

డాలీకి అనారోగ్యం అనగానే మనసులో బాధ కలిగింది రామిరెడ్డికి. డాలీని తలచుకుంటూ నెమ్మదిగా లోపలికి వెళ్ళాడు.

* * *

రామిరెడ్డి రిఫ్రెష్ అయి బయలుదేరబోతుంటే "ఏమండీ, ఇవాళ సినిమాకి వెళదామనుకున్నానండీ. పార్టీకి వెళ్ళకపోతే ఏం, వుండకూడదూ" అన్నది అనునయంగా రామిరెడ్డి భార్య.

"చూడు! ఊరు చివర వున్న మన బంజరు చుట్టుపక్కల బాగా ఇళ్ళు తయారైనాయి. దాన్ని ప్లాట్లు వేసి అమ్మితే అన్నీ డబ్బులే. అయితే దానికి కొన్ని ఫార్మాలిటీస్ పూర్తి చెయ్యాలి. అవి పూర్తి కావాలంటే దానికి మంత్రిగారి సహాయం కావాలి. అందుకు ఈ పార్టీ మంచి అవకాశం. సినిమా ఇంకో రోజు చూద్దాంలే" అని భార్యకు నచ్చజెప్పి బయలుదేరాడు రామిరెడ్డి.

* * *

రామిరెడ్డి పార్టీ నుండ బయటపడేటప్పటికి అర్థరాత్రయింది. మందు బాగా పుచ్చుకున్నట్టు అతని ముఖం చూస్తే తెలుస్తున్నది రఘుకి.

"ఎక్కడ చచ్చాడీ డ్రైవర్" అంటూ మత్తుగా కారులో కూర్చున్నాడు రామిరెడ్డి. డ్రైవర్ అప్పటిదాకా చూసి చూసి భోజనం చేసి వస్తానని రఘుకి చెప్పి వెళ్ళాడు.

"ఇప్పుడే వస్తాడు సార్. ఒక్క 5 నిమిషాలు ఆగుదాం" అన్నాడు రఘు.

"నో! నో! వాడు తరువాత వస్తాడులే! మనం పోదాం" అంటూ కారు స్టార్ట్ చేశాడు.

కారు జోరుగా పోతోంది. అతని ముఖంలో మత్తు చూస్తుంటే రఘుకి భయంగా వుంది. అవసరమయితేనే తప్ప మాట్లాడని రామిరెడ్డి నోటికొచ్చిందల్లా మాట్లాడుతుంటే ఆశ్చర్యంగా కూడా వుంది రఘుకి. 'మందు ప్రభావం అలా వుంటుంది కాబోలు' అనుకున్నాడు తాగే అలవాటు లేని రఘు. కారు స్పీడు ఇంకా పెరిగింది. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకు కూర్చున్నాడు రఘు. రామిరెడ్డి ముఖ కదలికల్నే గమనిస్తూ. ఉన్నట్లుండి సడన్ బ్రేకు పడి కీచుమని అరుచుకుంటూ నాలుగయిదు గజాలు వెళ్ళి ఆగింది కారు. ఆ దెబ్బతో మత్తు కాస్త దిగినట్టయింది

ప్రతిష్టమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

రామిరెడ్డికి. ఉలిక్కిపడిన రఘు గాబరాగా కారు దిగాడు. అతడు భయపడినంతా జరిగింది.

పక్కనే బక్క చిక్కిన బడుగు ముసలి వాడొకడు ఘోరంగా మూలుగుతూ పడి వున్నాడు. ఒళ్ళంతా రక్తం కారుతోంది.

"సార్ సార్!
మన కారు కింద ఒక ముసలోడు పడ్డాడు సార్! చచ్చేటట్టున్నాడు. ఈ దగ్గర్లోనే ఆస్పత్రి వుంది. అక్కడికి తీసుకెళదాం సార్" అన్నాడు రఘు కంగారుగా.

అది వినబడనట్టుగా "బండికేమన్నా దెబ్బ తగిలిందా" అన్నాడు రామిరెడ్డి.

"లేదు సార్"

"అయితే కారెక్కు"

"సార్" అని ఏదో చెప్పబోయాడు రఘు.

రామిరెడ్డి చిర్రుమన్నాడు. "ముందు కారెక్కు" అని అరిచాడు. రఘు కారెక్కి కూర్చున్నాడు.

"మన అదృష్టం! ఎవరూ చూడలేదు. వాడ్ని ఆస్పత్రికి తీసుకెళ్ళి కోరి కోరి కేసులో ఇరుక్కోమంటావా! పిచ్చివాడా!" అంటూ కారు వేగాన్ని పెంచాడు రామిరెడ్డి.

* * *

మరునాడు సాయంత్రం రామిరెడ్డి ఆఫీసుకు ఫోను చేశారు పోలీసులు.

"హలో! రామిరెడ్డిగారున్నారా" అడిగింది పోలీసు కంఠం."

"లేరండీ! ఒక అరగంటలో వస్తారు"

"ఎవరు మాట్లాడుతున్నది" పోలీసు కంఠం.

"నేను రెడ్డిగారి పి.ఏ.ని"

"నేను ఎస్.ఐ.ని మాట్లాడుతున్నాను పోలీస్

> ## అప్పు!
>
> బ్రిటిష్ కొలంబియాలో క్వాకియూటే అనే జాతివారు ఉన్నారు. వాళ్ళలో ఎవరికైనా డబ్బు అవసరమొచ్చినప్పుడు తమ పేరును తాకట్టుగా పెట్టి డబ్బు తెచ్చుకొంటారు. వాళ్ళు అప్పు తీర్చేంత వరకూ పేరులేని వారుగానే ఉంటారు. రుణం తీర్చగానే వాళ్ళ నామధేయం వాళ్ళకు వచ్చేస్తుంది!
>
> —కొడిమెల

స్టేషన్ నుంచి. ఇవాళ మధ్యాహ్నం ఓ ముసలతను కారు యాక్సిడెంట్‌లో చనిపోయాడు. అతడ్ని గుద్దిన కారు నెంబరు చెప్పాడతను. ఆ నెంబరు రామిరెడ్డిగారి కారు నెంబరులా వుంది. అందుకని ఫోను చేస్తున్నా. రెడ్డిగారు రాగానే ఒకసారి నాతో మాట్లాడమని చెప్పండి"

ఆ ముసలివాడి మరణ వార్త వినగానే మనసు చివుక్కుమన్నది రఘుకి. ఒక్క క్షణం ఆగి "ఓ.కె! అలాగే" అని ఫోను పెట్టేశాడు. 'అప్పుడే ఆస్పత్రిలో చేర్చి వుంటే బతికేవాడేమో అనుకున్నాడు మనసులో. రామిరెడ్డి రాగానే ఎస్.ఐ. ఫోను గురించి చెప్పాడు రఘు. వెంటనే అతను ఎస్.ఐ.తో మాట్లాడి రఘుని అతడి దగ్గరికి పంపించాడు కేసు మాఫీ చేయించటానికి.

* * *

ఇంటి ముందు గార్డెన్‌లో ఈజీ ఛైర్‌లో కూర్చుని పేపరు చదువుతున్నాడు రామిరెడ్డి. 'డాలీ' పరుగుతీస్తూ అతని దగ్గరికి వచ్చింది. "కమ్! కమ్! చాలా రోజుల తరువాత నీలో హుషారు చూస్తున్నా మళ్ళీ" అంటూ చేతుల్లోకి తీసుకున్నాడు డాలీని. "ఏరా సుందరయ్యా! ఏమన్నాడు డాక్టరు. పూర్తిగా తగ్గినట్లేనా డాలీకి" అని అడిగాడు. దగ్గరకొస్తున్న సుందరయ్యను చూసి. "అవునయ్యా! ఇంకేం బాధ లేదన్నరండి. ఇదుగో ఈ బిల్లు పంపించారండి డాక్టరు గారు" అని బిల్లు అందించాడు. బిల్లు చూశాడు రామిరెడ్డి. ఎనిమిది వేల నూట యాభై రూపాయిలు! "ఇక్కడ దొరక్కపోతే ఫారిన్ నుంచి తెప్పించారంటండీ మందులు. అందుకని బిల్లు కొంచెం ఎక్కువయిందని చెప్పారండి డాక్టరు గారు" వివరించాడు సుందరయ్య. "ఇట్సాల్ రైట్, ఇది రఘుకి ఇచ్చి చెక్కు ఏర్పాటు చెయ్యమని చెప్పు" అంటున్నాడు రామిరెడ్డి. అంతలోనే రఘు వచ్చాడు నమస్కారం చేస్తూ.

"గుడ్ న్యూస్ సార్ కారు యాక్సిడెంట్ కేసు పూర్తిగా మాఫీ అయిపోయింది" అన్నాడు రఘు. "ఐసీ!" అని, ఎంత ఖర్చయిందన్నట్లుగా చూశాడు రామిరెడ్డి.

"ఎనిమిది వేలయిం ది సార్ మొత్తం ఖర్చు. పోలీసుల ఖర్చులూ అవీ 5 వేలు. ఆ ముసలాడికి పెళ్ళి కావలసిన ఒక కూతురుంది. ఆ పిల్లకి దిక్కు ఇంకెవరూ లేరంట. అయిదు వేలన్నా ఇవ్వమని ఆ పిల్ల తరుపు వాళ్ళు అడిగారు. అసలు మా సార్‌ది తప్పేం లేదు! మేం పైసా కూడా ఇవ్వక్కర్లేదు ఏదో జాలితో ఇస్తున్నాం అని మూడు వేలతో సరిపెట్టాను సార్" చెప్పాడు రఘు.

"ఎనీ హౌ, ఇట్ కాస్టెడ్ మి హెవీలీ" అని నిట్టూర్చాడు రామిరెడ్డి.

యర్రంశెట్టి శాయి
కొత్త సీరియల్
మరణానికి చిరునామా
త్వరలో!

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్